సాక్షి పెద్దపల్లి

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



అయ్యస్వాములకు భిక్ష

రామగిరి: అయ్యప్పదీక్ష చేపట్టిన స్వాములకు ఎండీ ముజీబ్ భిక్ష ఏర్పాటు చేశారు. ఆయనను పలువురు అభినందించారు.



యాసంగి సాగుపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: యాసంగి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని డీఏవో ఆదిరెడ్డి చిన్నకల్వలలో సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/24.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసీఆర్‌కు పరామర్శ



ఆస్పత్రి ఎదుట మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

మంథని: హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఎమ్మెల్యే విజయరమణారావును మంగళవారం పలువురు నాయకులు, అధికారులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ అరుణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



బహుమతులు అందిస్తున్న రాధాస్వామి

సుల్తానాబాద్‌రూరల్: రేగడిమద్దికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ అండర్–14 బాలబాలికలకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. జిల్లాలోని 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. పెద్దపల్లి జోనల్ జట్టు ప్రథమ, రామగుండం జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఈ జట్లకు హెచ్‌ఎం రాధాస్వామి బహుమతులు అందజేశారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు సిరిసిల్లలో బుధవారం జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జోనల్ కార్యదర్శులు దాసరి రమేశ్, మాధురి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న సభ్యులు

జూలపల్లి(పెద్దపల్లి): విద్యార్థులకు 'ఉన్నతి' ప్రకారం విద్యాబోధన చేయాలని ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ టీం లీడర్ సరస్వతి సూచించారు. తెలుకుంట కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం, కళాశాలను మంగళవారం టీం సభ్యులతో కలిసి తనిఖీ చేశారు. పెద్దాపూర్ ఆదర్శ పాఠశాల, కళాశాల బాలికల వసతి గృహంలో వసతీ సౌకర్యాలపై ఆరా తీశారు. ప్యానెల్ టీం సభ్యులు వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, గీతా రాణి, మహేశ్, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్‌సూట్ అందజేత



ట్రాక్‌సూట్‌తో విద్యార్థి సన్విత

సుల్తానాబాద్(పెద్దపల్లి): గోదావరిఖనికి చెందిన బింగి సన్విత జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడంతో జూడో సంఘం జిల్లా చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ట్రాక్‌సూట్ అందజేశారు. కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో సన్విత పాల్గొంటుంది. ఆమెను పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గోదావరిఖనిటౌన్: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న పల్లె విగ్నేశ్వరి అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జింక మల్లేశం తెలిపారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు వనపర్తి జిల్లా నారాయణపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్, పీఈటీ దేవి, ఉపాధ్యాయులు రమాదేవి, శాస్త్రి, సంపత్‌రావు, ఉషారాణి, రాజమౌళి, శ్రీనివాస్ తదితరులు విగ్నేశ్వరిని అభినందించారు.

'కారు'ను దారిలో పెట్టేలా..



- అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సమీక్ష
- స్థానిక, పార్లమెంట్‌లో గెలుపే లక్ష్యంగా..
- కార్యాచరణ మొదలుపెట్టిన గులాబీబాస్‌లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

బీఆర్‌ఎస్‌కు కంచుకోటైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జోరుమీదున్న ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం బ్రేకులు వేసింది.ఎన్నికల ఫలితాలతో గులాబీ శ్రేణుల్లో కాస్త నిరుత్సాహం నెలకొంది. అయితే వరుసగా స్థానిక సంస్థలు, ప్రాదేశిక, మున్సిపల్, పార్లమెంట్ ఎన్నికలు రానుండడంతో క్యాడర్‌లో జోష్ నింపుతూ.. పార్టీని గెలుపుబాట పట్టించేందుకు అధిష్టానం సూచనలతో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముఖ్యనాయకులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే తమ అనుచరులు, నేతలతో కలిసి బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, ఓటమికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఉద్యమపార్టీగా ఉన్న బీఆర్‌ఎస్‌కు దూరమైన వర్గాలు ఏమిటీ..? వారిని తిరిగి మచ్చిక చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను సిద్ధం చేసుకుని కార్యాచరణకు సన్నద్ధమవుతున్నారు. మొదటగా ఢీలాపడిన కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ.. కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీల అములులో విఫలమైతే ప్రజల మద్దతుతో పోరాడేందుకు శ్రేణులను సమాయత్తం చేయనున్నారు.

వైఫల్యాలను ఎత్తిచూపుతూ

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 13స్థానాల్లో 8 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. బీఆర్‌ఎస్ ఐదుస్థానాలకు పరిమితం అయ్యింది. మెజార్టీ స్థానాలు గెలుచుకోలేకపోయినా.. గట్టి పోటీ ఇచ్చామని, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీయే విజయం సాధించిందని నేతలు చెబుతున్నారు. పార్టీ ఓడినా క్యాడర్ బలంగా ఉందంటూ నేతలను ఎన్నికల సమరానికి సిద్ధం చేయనున్నారు. ఉద్యమ పార్టీగా పోరాడిన బీఆర్‌ఎస్, సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై పోరాటం ద్వారానే ప్రజల మద్దతును తిరిగి పొందాలని చూస్తోంది. ఎన్నికలకు సమయం ఎక్కువ రోజులు లేకపోవడంతో అందివచ్చిన ప్రతి అంశాన్ని ప్రజల్లో చర్చకు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారానే తిరిగి విజయబావుటా ఎగరవేయాలని భావిస్తోంది.

ప్రజలు బీఆర్‌ఎస్ వైపే



ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలూ గెలుచుకుంటాం. పార్టీ జిల్లాలో పటిష్టంగా ఉంది. అందరు ప్రజాప్రతినిధులతో చర్చించి ముందుకు వెళ్తాం. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు స్థానాలు తిరిగి గెలుచుకున్నాం. రానున్న ఎన్నికల నాటికి బలోపేతమై పక్కాప్రణాళికతో ముందుకు వెళ్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతాం. – కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

దీటుగా ఎదుర్కొంటాం



స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించే దిశగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తాం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు.. బీఆర్‌ఎస్‌కు కేవలం 2 శాతం ఓట్ల తేడానే ఉంది. జిల్లాలో నాలుగు స్థానాలకు రెండు ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్నాం. కాంగ్రెస్ పార్టీ చేసిన అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. వారు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, తదితర హామీలపై బలమైన ప్రతిపక్షంగా నిలదీస్తాం. ప్రజల మద్దతుతో బలమైన ఉద్యమాలను నిర్మించి ఉద్యమపార్టీగా ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతాం.

– జీవీ.రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభీష్టం మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్తాం. పార్లమెంట్ ఎన్నికల్లోను బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుంది. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి.

– తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం



అసెంబ్లీ ఫలితాలు బీఆర్‌ఎస్ శ్రేణులకు అసంతృప్తి కలిగించినా.. నేతలు, కార్యకర్తలందరం ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని వచ్చే పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తాం. ఓడిపోయామని ఢీలా పడాల్సిన అవసరం లేదు. మరింత పట్టుదలతో కేసీఆర్, కేటీఆర్ ఆదేశాలు, సూచనలతో ముందుకు సాగుతాం. కార్యకర్తలకు అండగా ఉంటూనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అములులో విఫలమైతే ప్రజల మద్దతుతో పోరాటం చేస్తాం.

– కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం



అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై పార్టీ పెద్దలు ఇప్పటికే సమీక్ష జరిపారు. పొరపాట్లు సరిదిద్దుకుని స్థానిక, పార్లమెంటు ఎన్నికలకు సిద్ధం అవుతాం. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు నిరంతర పోరాటం చేస్తాం. అవసరం అయితే పోరాటాలకు వెనుకాడేది లేదు. మాకు కాంగ్రెస్ పార్టీకి ఓట్ల వ్యత్యాసం కేవలం 2శాతం మాత్రమే. ఓడిపోయినా మేం క్షేత్ర స్థాయిలో చాలా బలంగా ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ పథకం అమలు కాకున్నా ఎక్కడికక్కడ నిలదీస్తాం.

– డాక్టర్ బీఎస్.రావు, బీఆర్‌ఎస్ నాయకుడు

అమ్మా.. బస్సు ప్రయాణం ఎలా ఉంది?




ప్రయాణికురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆర్టీసీ బస్సు కండక్టర్‌తో మాట్లాడుతూ..

- కండక్టర్ గారూ.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?
- మహిళా ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందిని ఆరా తీసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్(మంథని): 'అమ్మా.. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ఎలా ఉంది.. కండక్టర్ గారూ... మీకు ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆరా తీశారు. మంగళవారం కమాన్‌పూర్ నుంచి పెద్దపల్లి వరకు ఆర్టీసీ బస్సులో ఆయన ప్రయాణం చేశారు. ప్రభుత్వం చేపట్టిన 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా అందిస్తున్న మహిళలకు ఉచిత బస్సు సేవలపై ఆరా తీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పేద, మధ్యతరగతి మహిళలకు ఎంతో ఊరటనిచ్చిందని ఓ ప్రయాణికురాలు కలెక్టర్‌కు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. తమ అవసరాల మేరకే బస్సులో ప్రయాణిస్తామని, మొన్నటిదాకా చార్జీలు అడ్డగోలుగా ఉండేవని, ఇప్పుడు పైసా లేకుండా ప్రయాణించే అవకాశం ఇచ్చారని తెలిపారు. 'బస్సులు సమయానుకూలంగా నడుస్తున్నాయా, ప్రయాణికులకు ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా? ఉచిత బస్సు ప్రయాణ పథకం అములుతో మీకేమైనా సమస్యలు ఉన్నాయా' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బస్ కండక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బస్సులు సకాలంలోనే ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయని, పథకం అమలు తీరుతో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని కండక్టరు స్పష్టం చేశారు.

'సఖి' భవనం పనుల పరిశీలన

రంగంపల్లిలో చేపట్టిన సఖి భవన నిర్మాణం ప్రగతిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని పంచాయతీరాజ్ డీఈఈ శంకరయ్యను ఆదేశించారు. జిల్లా సంక్షేమశాఖాధికారి రవుఫ్‌ఖాన్, సఖి కో ఆర్డినేటర్ స్వప్న, సీడీపీవో కవిత, సూపర్‌వైజర్ ప్రేమలత తదితరులు ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- సాంఘిక సంక్షేమ గురుకులాల సంయుక్త కార్యదర్శి శారద



బహుమతులు అందిస్తున్న అతిథులు

ధర్మారం(ధర్మపురి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలోనూ నైపుణ్యం పెంపొందించుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ శారద సూచించారు. నందిమేడారం సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో చేపట్టిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి విద్యార్థులు క్రీడాపోటీలకు హాజరయ్యారని శారద తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు పెద్దపల్లి ఆర్‌డీవో మధుమోహన్, శారద బహుమతి ప్రదానం చేశారు. ప్రతీవిద్యార్థి క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఓటమి చెందిన క్రీడాకారులు నిరాశ చెందకుండా మరింత శ్రమించి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, ఎంపీడీవో జయశీల, ప్రిన్సిపాల్ జయశీల, క్రీడాకారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చివరివరకు హోరాహోరిగా పోరాడి గెలుపొందిన విజేతల వివరాలను క్రీడా పోటీల నిర్వాహకులు ప్రకటించారు. అండర్– 14 కబడ్డీ పోటీల్లో పాలకుర్తి, టెన్నికాయిట్‌లో ధర్మారం, చెస్‌లో తొర్రూర్, అండర్– 17 వాలీబాల్‌లో భద్రాచలం, కబడ్డీలో ముల్కాలపల్లి, టెన్నికాయిట్‌లో నదిగూడెం, చెస్‌లో కొల్లాపూర్, అండర్– 19 వాలీబాల్‌లో పాలకుర్తి, కబడ్డీలో నకిరేకల్, టెన్నికాయిట్‌లో మడికొండ, చెస్ పోటీల్లో కొత్తకోట విద్యాలయాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

రేపు దివ్యాంగులకు ఆటల పోటీలు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని పరేడ్‌గ్రౌండ్‌లో గురువారం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ తెలిపారు. 10ఏళ్ల నుంచి ఏళ్లు, 17 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసు గల వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పరుగు పందెం, మూడు చక్రాల బండితో పరుగు, షాట్‌పుట్, చెస్, క్యారం తదితర పోటీలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు చేపట్టామన్నారు. ఆసక్తిగల దివ్యాంగులు ఈనెల 14న కలెక్టరేట్‌లో జరిగే పోటీలకు హాజరు కావాలని ఆయన కోరారు.





సత్తాచాటిన మహిళా రెస్క్యూ టీం

గోదావరిఖని: ఆల్ ఇండియా మైన్స్ రెస్క్యూ పోటీలు రెండోరోజు మంగళవారం ఆకట్టుకున్నాయి. హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ కంపెనీకి చెందిన మహిళా జట్టు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించింది. ఫస్ట్ ఎయిడ్, స్టాట్యుటరీ, థియరీ పరీక్షల్లో పోటీపడ్డారు. అనంతరం జీడీకే-7 ఎల్‌ఈపీ భూగర్భ గనిలోకి దిగి రెస్క్యూ, రికవరీ, ఫ్రెష్ ఎయిర్ బేస్ విభాగాల్లో జరిగిన పోటీల్లో తమ సత్తా చాటారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహిస్తున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఆనంది

కమాన్‌పూర్(మంథని): ఈనెల 17న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది ఎంపికైంది. ఇటీవల హన్మకొండలో నిర్వహించిన ఎస్జీఎఫ్ఐ అండర్–14 పోటీల్లో ఆనంది ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించింది. ఆనంది ఆదిలాబాద్ స్పోర్ట్స్ పాఠశాలలో చదుకుంటోంది.

కొనుగోలు చేసి.. పొదల్లో పడేసి..

- వినియోగించకుండానే వదిలేసిన వైనం
- తుప్పపట్టి, దొంగలపాలవుతున్న జనరేటర్లు, విడిభాగాలు
- రామగుండం కార్పొరేషన్‌లో వృథా అయిన రూ.60 లక్షలు



ఇది 400 కేవీఏ సామర్థ్యం కలిగిన భారీ జనరేటర్. విద్యుత్ కోతల సమయంలో తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తితే దీనిద్వారా సమస్య పరిష్కరిస్తారు. 2011లో శారదానగర్ వాటర్ ట్యాంక్ ఆవరణలో దీనిని బిగించారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్ పనికిరాకుండా పోయింది. ఇందులోని విడిభాగాలు కూడా చోరీకి గురయ్యాయని తెలుస్తోంది.



ఇది 200 కిలోవోల్ట్స్ యామ్స్(కేవీఏ) సామర్థ్యం కలిగిన జనరేటర్. గోదావరి నది హెడ్ వర్క్స్ వద్ద దీనిని 2011లో ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తితే ప్రత్యామ్నాయంగా ఈ జనరేటర్ ద్వారా నీటి సరఫరా చేయాలనేది లక్ష్యం. ప్రస్తుతం ఇది పనికిరాకుండా పోయింది. దీని గురించి పట్టించుకునేవారు లేక విలువైన పరికరాలు చోరీకి గురయ్యాయి.

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని విలువైన వాహనాలు, ఆధునిక యంత్రాలపై పర్యవేక్షణ కరువైంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేయగా, వాటిని వినియోగించకుండానే పనికిరాకుండా పోతున్నాయి. తద్వారా రూ.లక్షల ప్రజాధనం వృథాగా పోతోంది. ఇందులో భాగంగానే రూ.60 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రెండు ఆధునిక జనరేటర్లు వినియోగించకుండానే శిథిలమై అలంకారప్రాయంగా మిగిలాయి. అధికారుల పర్యవేక్షణ లేక ఇందులో విలువైన పరికరాలు దొంగలపాలయ్యాయి. పనికిరాకుండా మారిన ఈ జనరేటర్లను చెట్ల పొదల్లో పడేశారు.

2011లో కొనుగోలు..

- నగరపాలక సంస్థలో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చడానికి రూ.33 కోట్ల హడ్కో రుణాన్ని కేంద్రప్రభుత్వం 2006లో మంజూరు చేసింది.
- ఈ నిధుల్లో కొంత సొమ్ము వెచ్చించి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పలు ప్రాంతాలకు పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టారు.
- శారదానగర్ వాటర్ ట్యాంక్ వద్ద నాలుగు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేశారు.
- గతంలో విద్యుత్ కోతలు తరచూ ఉండేవి. జనరేటర్ల సాయంతో అప్పుడు విద్యుత్ మోటార్లు నడిపి మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూసేవారు.
- అందుకే హడ్కో నిధుల్లోంచి రూ.60 లక్షలు వెచ్చించి రెండు ఆధునిక జనరేటర్లను అప్పట్లో కొనుగోలు చేశారు.
- ఒక జనరేటర్‌ను గోదావరి నది హెడ్‌వర్క్స్ వద్ద, మరోదానిని శారదానగర్ పంప్‌హౌస్ ఆవరణలో ఏర్పాటు చేశారు.

మూలనపడ్డ జనరేటర్లు..

జనరేటర్ల కొనుగోలుకు అప్పుగా తీసుకున్న రూ.60 లక్షల హడ్కో నిధులకు 12 శాతం వడ్డీతో బాకీలు చెల్లించిన పాలకులు, అధికారులు.. జనరేటర్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. ట్రయల్‌రన్ చేసిన అధికారులు, ఆ తర్వాత వీటిని ఏనాడూ వినియోగించలేదు. గంటకు 50 నుంచి 70 లీటర్ల వరకు డీజిల్ అవసరం ఉంటుందనే సాకుతో వాటిని వినియోగించకుండా మూలనపడేశారనే విమర్శలు ఉన్నాయి. కానీ జనరేటర్లను వాడినట్లు రికార్డులు రాస్తూ తరచూ వేల లీటర్ల డీజిల్‌కు బిల్లులను అక్రమంగా రాసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

ప్రజాధనం వృథా..

- తాగునీటి సరఫరాలో అంతరాయం కలుకుండా విద్యుత్ మోటార్లను రన్ చేసేందుకు జనరేటర్ల కొనుగోలుకు వెచ్చించిన రూ.60 లక్షల ప్రజాధనం వృథా అయ్యిందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- అధికారులు జనరేటర్ల నిర్వహణను విస్మరించారని మండిపడుతున్నారు.
- ఏళ్ల తరబడి వాటిపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.
- దీంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.
- పనికి రాకుండా పోయిన జనరేటర్లను ఏం చేయాలో అర్థంకాక అధికారులు చెట్లపొదల్లో వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

మళ్లీ రూ.22 లక్షలతో కొత్తవి కొనుగోలు..

రెండు ఆధునిక జనరేటర్లు అందుబాటులో ఉన్నా నిరుపయోగమే అయ్యాయి. దీంతో గతేడాది రూ.22లక్షలు వెచ్చించి మరో జనరేటర్ కొనుగోలు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి కొనుగోలు చేసిన ఈ జనరేటర్ సామర్థ్యం 160 కేవీఏ ఉంది. ఇది డొమెస్టిక్ జనరేటర్. నగర మేయర్ చాంబర్ వెనకాల దీనిని ఏర్పాటు చేశారు.

మేయర్, కమిషనర్‌తో చర్చిస్తాం



హడ్కో నిధులతో కొనుగోలు చేసిన రెండు జనరేటర్లు పనిచేయడం లేదు. వీటి ప్రస్తుత పనితీరును మరోసారి పరిశీలిస్తాం. నగర మేయర్, కమిషనర్‌తో చర్చిస్తాం. పనిచేయని జనరేటర్ల విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం.

– జమీల్, ఇన్‌చార్జి డీఈ

క్లుప్తంగా

కేసీఆర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చందర్


కేసీఆర్‌తో కరచాలనం చేస్తున్న చందర్

గోదావరిఖని: కాలికి గాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రికి వెళ్లిన కోరుకంటి చందర్.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని చందర్ ఆకాంక్షించారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు


మెడల్స్ సాధించిన విద్యార్థులు వీరే..

గోదావరిఖనిటౌన్: స్థానిక విఠల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారు. సమర్పిత్ గోల్డ్‌మెడల్, రిశ్విత సిల్వర్ మెడల్ సాధించారు. ప్రధానోపాధ్యాయుడు బొంతల సతీశ్‌బాబు, ఉపాధ్యాయులు మనోహర్, అనురాధ, నవేశ్, జబీన్, సంగీత, కరాటే మాస్టర్ శంకర్, విద్యార్థులను మంగళవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక


కపిల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామగుండం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.కపిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.సోమశేఖర్, హెచ్‌ఎం ఏకాంబరం, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, వైస్ చైర్మన్ ఉమాదేవి తదితరులు కపిల్‌ను అభినందించారు.

గ్యాస్ సిలిండర్ చోరీ

పాలకుర్తి(రామగుండం): కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంటగదిలోని గ్యాస్ సిలిండర్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. రాత్రి సమయంలో వంటగది తాళం పగులగొట్టి అందులోని సిలిండర్‌తో పాటు వంటసామగ్రి అపహరించారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన సిబ్బంది తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. గదిలోకి వెళ్లి చూడగా సామాను చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయమై బసంత్‌నగర్ పోలీసులకు మౌఖికంగా సమాచారం అందించారు.

చెక్కు బౌన్స్ కేసులో జైలు

పెద్దపల్లిరూరల్: బాకీ తీర్చేందు కోసం చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ మంగళవారం తీర్పునిచ్చారని న్యాయవాది సురేశ్‌బాబు తెలిపారు. గొరెడ్డిపేటకు చెందిన ముస్త్యాల నవీన్ నుంచి రూ.5లక్షలను 2017జూలై 5న అదే గ్రామానికి చెందిన బండారి తిరుపతి అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించేందుకు తిరుపతి ఇచ్చిన చెక్కును బ్యాంకులో వేయగా అది చెల్లుబాటు కాలేదు. దీంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాల తర్వాత మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పు ఇచ్చారని న్యాయవాది పేర్కొన్నారు.

గోసపడుతున్నా 'గుర్తింపు' లేదు

- మా బాధలు ఎవరికీ పట్టవా?
- దశాబ్దాలుగా సమస్యలు అలాగే..
- మాకూ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి
- లేదా గుర్తింపు ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి
- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల డిమాండ్


బెల్ట్ వద్ద బొగ్గు చూర, ఇతర వ్యర్థాలను శుభ్రం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: 'సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్నా మా గోస పట్టించుకునేవారే కరువయ్యారు.. అనేక సమస్యలతో సతమతమవుతున్నాం.. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నాం.. అయినా అన్నింటా అన్యాయమమే జరుగుతోంది.. మాకంటూ ఓ సంఘం ఉంటే మా బాధలు కూడా తీరుతాయి' అంటున్నారు కాంట్రాక్టు కార్మికులు. సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో కాంట్రాక్టు కార్మికులు సుమారు 25 వేల మందికిపైగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులు సుమారు 39వేల మంది ఉండగా వారికోసం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న కార్మికశాఖ.. కాంట్రాక్టు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించలేకపోతోంది.

అనేక విభాగాల్లో విధులు..

సింగరేణి బొగ్గు గనుల సంస్థలో కీలక విభాగాలైన సివిల్, సివిక్, బెల్ట్‌క్లీనింగ్, భవనాల నిర్వహణ, కన్వేయన్స్ వాహనాల డ్రైవర్లు, సేల్ పిక్కింగ్, తోటమాలి, స్కావెంజర్ తదితర పనలతోపాటు భూగర్భగనుల్లో కూడా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. తక్కువ వేతనంతో ఎక్కువ పనిచేయిస్తున్న కాంట్రాక్టు యాజమాన్యం.. తమకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదని కార్మికులు వాపోతున్నారు. కనీసవేతనాలు పెంచడంతోపాటు ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, డిమాండ్లు..

- అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి
- హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి లేదా జీవో నంబర్ 22 అమలు చేయాలి
- సింగరేణిలోని ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలి
- ఓబీలతో సహా అన్నింటిలోనూ స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- సింగరేణి ఏటా సాధించే లాభాల వాటా లేదా 20శాతం బోనస్ చెల్లించాలి.
- కార్మిక కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలి
- 26–09–2022న జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి
- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి
- కేటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లించాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

- తరగతి గదుల్లోనే భవిష్యత్‌కు పునాది
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


బోధన తీరుపై సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ప్రాథమికస్థాయి పాఠశాల బోధన శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల చెంతనే కూర్చున్నారు. వారు ప్రదర్శిస్తున్న విద్యాబోధన తీరు నిశితంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు పడుతాయన్నారు. ఆ విషయాన్ని ప్రతీ ఉపాధ్యాయుడు గుర్తించాలని సూచించారు. చంద్రయాన్–3 లాంటి అనేక అద్భుతాలు మన దేశంలోనే సాధ్యమవుతున్నాయని, ఈ విషయాన్ని కూడా నేర్పింది ఉపాధ్యాయులేనని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల కృషితోనే తొలిమెట్టు విజయవంతమైందని ప్రశంసించారు. పట్టుదలతో పనిచేస్తే పాఠశాలలు ఉన్నతంగా మారుతాయని, రాబోయే తరానికి నాణ్యమైన సమాజం తయారవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతీఉపాధ్యాయుడు ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధికి తోడ్పాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టిపెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని సూచించారు. సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు రోజూ బడికి వచ్చేలా చూడాలని సూచించారు. ప్రతీమూడో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల పనితీరు తెలియజేయాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కుదురుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి డి.మాధవి, అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, హెచ్‌ఎంలు సురేశ్‌కుమార్, శ్రీనివాస్, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై నివేదిక ఇవ్వండి

- ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


అధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై వారంరోజుల్లో తమకు సమగ్ర నివేదిక సమర్పించాలని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పనితీరు, ప్రభుత్వం కేటాయించిన నిధుల గురించి అధికారులు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, కేయించిన నిధులు, విడుదల చేసిన నిధుల గురించిన సమగ్ర సమాచారం తనకు అందజేయాలన్నారు. పనుల పూర్తి, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలతో సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేయరాదన్నారు. నిబంధనల ప్రకారంగా కొనుగోలు చేయాలని అన్నారు. ధాన్యం తూకంలో కోతలు విధించరాదని సూచించారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. మేడారం ఎస్సీ వసతి గృహంలో కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంపై ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం పాఠశాలలో విద్య నాణ్యత ప్రమాణాలు పెంచుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ నారాయణరెడ్డి, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో జయశీల, అడవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి, వెటర్నరీ అధికారి కిశోర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభిస్తున్న అయిలి ప్రసాద్

మంథని: మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపు కోసం మైదుపల్లి సర్పంచ్ కవిత పాదయాత్ర చేపట్టారు. శ్రీధర్‌బాబు విజయం సాధిస్తే కన్నాల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తానని గతంలో మొక్కుకున్నారు. ఈనేపథ్యంలో మైదుపల్లి గ్రామంలో శనివారం పాదయాత్ర ప్రారంభించారు. మంగళవారం మంథని మీదుగా కన్నాల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఎంపీపీ కొండ శంకర్, నాయకులు అజీంఖాన్, జనగామ నర్సింగరావు, కుడుదుల వెంకన్న, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జయ్యారంలో గుడిసె దగ్ధం

పాలకుర్తి(రామగుండం): జయ్యారం గ్రామంలో సోమవారం రాత్రి ప్రమాదవాశాత్తు నిప్పంటుకుని ఆడెపు రాజేశం అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. బసంత్‌నగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశం తన ఇంటి సమీపంలోని చెత్తాచెదారం కాల్చి వేస్తుండగా నిప్పురవ్వలు ఎగిరివచ్చి గుడిసెపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగాయి. అయితే బాధితుడు మాత్రం గ్యాస్ సిలిండర్ పేలడంతోనే మంటలు వ్యాపించాయని అంటున్నాడు. మంటల ధాటికి ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి దాదాపు 500 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. వెంటనే స్థానికులు గోదావరిఖని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఈసంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో సుమదరు 3 క్వింటాళ్ల బియ్యం, బట్టలతోపాటు నగదు, గృహోపకరణ వస్తువులు కాలిపోయాయని బాధితుడు రాజేశం కన్నీరుమున్నీరయ్యాడు. కేవలం కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఐఎన్‌టీయూసీలో చేరిక


యూనియన్‌లో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: టీబీజీకేఎస్ సీనియర్ నాయకుడు బేబీ శ్రీనివాస్ మంగళవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్‌లో చేరిన శ్రీనివాస్‌కు సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కండువాకప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎస్.నర్సింహారెడ్డి, ధర్మపురి, కచ్చకాయల సదానందం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం


చేతి సంచులు పంచుతున్న వెంకటేశం

జూలపల్లి(పెద్దపల్లి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండు వెంకటేశం కోరారు. పెద్దాపూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం కార్మికులకు చేతిసంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తు, సామగ్రి వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొప్పరి మహేశ్, దాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనాదారుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని స్వప్నకాలనీకి చెందిన ఐతు శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. అటుగా వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

బొగ్గు బాయి

ఏఐటీయూసీ పోరాటంతోనే ఎన్నికలు

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: ఏఐటీయూసీ చేసిన న్యాయ పోరాటంతోనే సింగరేణి బొగ్గు గనుల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగుతున్నాయని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తమ స్వలాభం కోసం ఎన్నికలు వాయిదా వేయించిన కొన్ని కార్మిక సంఘాలు.. ఇప్పుడు కార్మికుల ఓట్లను ఎలా అడుగుతాయని ప్రశ్నించారు. కారుణ్య నియామకాల పేరిట కాసుల దందా నడిపిన టీబీజీకేఎస్, పదేండ్లుగా నిద్రపోయిన ఐఎన్‌టీయూసీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆగిపోయిన గడియారాన్ని నడిపే ప్రయత్నం చేస్తున్నాయనివిమర్శించారు. అధికారన్ని చూసి యూనియన్లు నడిపే వారిని కార్మిక వర్గం నమ్మకూడదని సూచించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు కూడా పోరాటాలు, కేసులకు వెనుకాడకుండా ఏఐటీయూసీ ముందుకు సాగిందని గుర్తుచేశారు. ఈనెల 27న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో నక్షత్రం గుర్తుపై ఓటువేసి ఏఐటీయూసీని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోశం, శ్రీనివాస్, గౌతం గోవర్ధన్, బోగ సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- ఐఎన్‌టీయూసీ నేతలు బాబర్ సలీంపాషా, జనక్‌ప్రసాద్


కండువాలు కప్పి యూనియన్‌లోకి స్వాగతిస్తున్న బాబర్, జనక్‌ప్రసాద్

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని ఆ యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, కార్యదర్శి జనక్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని బాబర్ సలీంపాషా నివాసంలో పలువురు సింగరేణి కార్మికులు యూనియన్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గడియారం గుర్తుకు ఓటువేసి ఐఎన్‌టీయూసీని గెలింపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, నరసింహరెడ్డి, అంజి, నీలం వెంకన్న, సందీప్‌కుమార్, కళాధర్, దుర్గాప్రసాద్, రాజు, గౌస్, రాజ్‌కుమార్, శేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న నాయకులు

రామగిరి(మంథని): కార్మికుల సంక్షేమం హెచ్‌ఎంఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు ఉమమహేశ్వర్ అన్నారు. సెంటనరీకాలనీ హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా 42ఏళ్లుగా కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. యువ నాయకత్వాన్ని హెచ్‌ఎంఎస్ ప్రోత్సహిస్తుందని అన్నారు. సంస్థలోని 12 ఏరియాల్లో యువతకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న తమ యూనియన్ తరాజు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని వారు కోరారు. ఈ సమావేశంలో నాయకులు క్రాంతి కిరణ్, శాంతిస్వరూప్, మంగీలాల్, లక్ష్మణ్, రంజిత్, వాజీద్ అలీ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో డైరెక్టర్ల పర్యటన


మాట్లాడుతున్న డైరెక్టర్లు

రామగిరి(మంథని): ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో సింగరేణి ఆపరేషన్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. అనంతరం అధికారులతో ఉత్పత్తి, ఉత్పాదక, భవిషత్ ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ–2 ఉపరితల గనిని సందర్శించారు. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని అన్నారు. ఆర్జీ–3 జీఎం ఎన్.సూధాకర్‌రావు, కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య, అధికారులు ఎస్.సమ్మయ్య, డి.బైద్య, ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వర్‌రావు, కె.రాజేందర్, జైనుల్లా బద్దీన్, పద్మరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డ్రిల్లింగ్ పనులు

- సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న సింగరేణి అధికారులు

గోదావరిఖని: డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనుల్లో ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఓబీ వెలికితీతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి ఉపరితల గనుల్లో నిర్వహిస్తున్న డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనులకు ఎక్స్‌ప్లోజివ్ సంస్థ అధికారులకు, ఓబీ రిమూవింగ్ అధికారలకు తగుసూచనలిచ్చారు. బ్లాస్టింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సింగరేణిలో బ్లాస్టింగ్ ఖర్చు తగ్గించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, ఎక్స్‌ప్లోజివ్ మెరుగుపర్చేందుకు చేపట్టాల్సిన ప్రణాళిక, కచ్చితమైన బ్లాస్టింగ్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. బ్లాస్టింగ్ సమయంలో వైబ్రేషన్ శాతం తగ్గించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు, రక్షణ చర్యలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చర్చించారు. సాధ్యమైనంత నాణ్యమైన ఎక్స్‌ప్లోజివ్ వినియోగించి నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–1,2,3 జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్వీ సూర్యనారాయణ, సుధాకర్‌రావు, భూపాలపల్లి జీఎం బళ్లారి శ్రీనివాసరావు, బెల్లంపల్లి రీజియన్ జీఎం రవిప్రసాద్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి ఉజ్వల భవిష్యత్

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్


కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న

గోదావరిఖని: ఏఐటీయూసీ గెలుపుతోనే సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఓసీపీ–3లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఈనెల 27న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకత్వం కలిగిన ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. తమ యూనియన్ ద్వారానే కార్మికుల హక్కులకు రక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికలు అయిన వెంటనే సింగరేణిలో చాలాఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఎన్–1 రద్దు చేయించి, కరోనాకు ముందు ఉన్న మాదిరిగా ప్లేడేలు, పేహాలిడేలు ఇప్పిస్తామని అన్నారు. సొంతింటి పథకం కింద 200 గజాల స్థలం, రూ.20 లక్షలు వడ్డీలేని రుణం ఇప్పస్తామని, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగు పరుస్తామన్నారు. సంస్థకు రావలసిన సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించేలా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఎల్.ప్రకాశ్, రాజారత్నం, రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, శ్యాంసన్, గంధం సాంబశివరావు, మామిడి మహేందర్, రవికుమార్, వెంకటేశ్వర్లు, ఎజ్జ రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో కార్మికులు యూనియన్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

టీబీజీకేఎస్‌ను ఆదరించండి

రామగిరి(మంథని): కార్మికుల సమస్యల పరిష్కారం కేవలం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య మంగళవారం కోరారు. అనేక ఏళ్లుగా అమలుకు నోచుకోని వారసత్వ ఉద్యోగాల కల్పన కేసీఆర్‌తోనే సాధ్యమైందని గుర్తుచేశారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.